రెండు ఇండ్లలో చోరీ

బీరువా తాళాలు విరగ్గొట్టి వస్తువులన్నీ చిందరవందరగా పారవేసిన దృశ్యం

పరిగి, ఏప్రిల్ 23 : పరిగి పట్టణంలోని రెండు ఇండ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కొడుకు పెండ్లి కోసం స్వగ్రామానికి వెళ్లిన వ్యక్తి ఇంటితోపాటు అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న మరో వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. పరిగి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసముండే పాల్యా తుక్యానాయక్ కొడుకు వివాహం కోసం స్వగ్రామమైన మైసమ్మ చెరువు తండాకు కుటుంబ సమేతంగా వెళ్లాడు. బుధవారం ఉదయం డబ్బులు తీసుకువెళ్దామని వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో తుక్యానాయక్ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న ముజీబ్ తన అత్తగారింటికి కుటుంబ సమేతంగా వెళ్లగా ఈ రెండు ఇండ్లలో దొంగలు తాళాలు విరగ్గొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. మరో ఇంటి నుంచి ఎవరు బయటకు రాకుండా గొళ్లెం పెట్టి మరీ తాళాలు వేసిన ఇండ్లలో చోరీ చేశారు. రెండు ఇండ్లలో కలిపి రెండున్నర తులాల బంగారం, 28 తులాల వెండి, రూ.2.15లక్షలు నగదు చోరీ చేశారు. బాధితులు పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాగునీటి సమస్యరాకుండా చూసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

తాండూరు రూరల్, ఏప్రిల్ 23 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంఎన్ఆర్ఈజీఎస్ సిబ్బ ందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు శానిటేషన్ పై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా పైపులైన్ల లీకేజీలుంటే వెంటనే సమస్య పరిష్కరించాలని, తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. మొక్కలను సంరక్షించే బాధ్యత ఉపాధి హామీ సిబ్బంది తీసుకోవాలని, ఒక్క మొక్క కూడా ఎండిపోరాదని తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రాజీవ్ యువ వికాసంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంపీఈవో, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బొంరాస్‌పేట, ఏప్రిల్ 23 : తుంకిమెట్ల సెక్టార్ పరిధిలోని లింగన్‌పల్లి అంగన్‌వాడి కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడికి వస్తున్న చిన్నారుల చేత ఆటలు,పాటలను ప్రదర్శింప చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్స్ సుగుణ, అర్చన, జగదీశ్వరీ,చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కులకచర్ల, ఏప్రిల్ 23: గురుకుల పాఠశాలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుప్పలి ఆనంద్ కుమార్ అన్నారు. బుధవారం కులకచర్ల మండల పరిధిలోని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల నుండి ఎక్కువగా గురుకుల పాఠశాలకు ఎంపికై 5వ తరగతిలో ప్రవేశం పొందారని వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను ఆందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కోస్గి భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళితులను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 23 : కొడంగల్ పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య అధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ దుద్యాల మండలం కుదుమళ్ల గ్రామంలో దళితులను గ్రామ బహిష్కరణ చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా కుదురుమళ్ల గ్రామంలో అంబేద్కర్ చిత్రపటంతో దళితులు ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో ఆగ్రకులాలకు చెందిన వారు అడ్డుకొని అవమానించడం జరిగిందని, ఈ నెల 15న దుద్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దళిత,ప్రజాసంఘాల నాయకుల అధ్వర్యంలో ఈ నెల 18న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో మాపై కేసు నమోదు చేయిస్తారా అంటూ దళితులకు సహకరించిన వారిపై రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్మానించారని ఆరోపించారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే దళితులకు రక్షణ లేకపోతే రాష్ట్రంలో దళితులకు రక్షణ ఎక్కడుంటుందన్నారు. కలెక్టర్, ఎస్పీ దళితులకు న్యాయం చేయాలని అన్నారు. లేని పక్షంలో దళిత,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం,ఎంఎన్ఎస్, ఎస్సీ,ఎస్టీ,ఎంఆర్‌పిఎస్ సంఘాల నాయకులు చిన్ని కృష్ణ, కొండ ఆశోక్, మల్కన్న, శ్రీనివాస్, లక్ష్మణ్, లాలప్ప, బందప్ప, సంజీవ్, ఆంజనేయులు, నర్సింహులు, గణేశ్, వెంకటేశ్, సాయిలు, రాములు తదితరులు పాల్గొన్నారు.

కన్నీళ్లు మిగిల్చిన అకాల వర్షం..

• వడగండ్ల వానతో వరి పంటకు నష్టం • గాలిదుమారంతో నేలరాలిన మామిడి • ఆందోళనలో అన్నదాతలు

అయినాపూర్‌లో ధ్వంసమైన వరి పంట

దిర్సంపల్లిలో నేల రాలిన మామిడి

దోమ, ఏప్రిల్ 23: అకాల వర్షం రైతన్నలకు కన్నీళ్ళు మిగిల్చింది. దోమ మండల పరిధిలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షం రైతన్నలకు అపార నష్టం కలిగించింది. దోమ మండల కేంద్రంతో పాటుగా పాలేపల్లి, అయినాపూర్, దిర్సం పల్లి, రాకొండ, మల్లేపల్లి తదితర గ్రామాల్లో తీవ్ర గాలిదుమారంతో కూడిన వడగండ్ల వాన కురిసింది. దీంతో అయినాపూర్ పెద్ద చెరువు ఆయకట్టు కింద సాగు చేసిన వరి నేల రాలి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామా నికి చెందిన నల్ల మైబయ్య, నర్సింహులు, బుసని కృష్ణయ్యలు,మంతటి విజయ లతో పాటు కోత దశకు వచ్చిన చాలా మంది రైతుల వరి పంట నేల రాలి నష్టం వాటిల్లింది. మామిడి కాయలు రాలి అమ్ముకుందామనే తరుణంలో వారికి కన్నీళ్లనే మిగిల్చింది. అకాల వర్షంతో గాలి దుమారం చెలరేగగా దోమ పాలేపల్లి రోడ్డుపై చెట్లు విరిగి పడగా, దిర్సంపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని దిర్సంపల్లి ఫీడర్‌లో సూరసద్రం చెరువు కట్ట దగ్గర ఓ భారీ వృక్షం విరిగి పడటంతో ఐదు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడి రెండు రోజులు గడిచినా ఇప్పటికీ వాటిని పునరుద్ధరించ లేదు. స్తంభాలు రావాలీ అప్పుడే గానీ విద్యుత్‌ను పునరుద్ధరిం చలేమని అధికారులు చెబుతున్నట్లు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.అకాల వర్షం కారణంగా నష్ట పోయిన రైతుల పంట పొలాలను సంబంధిత వ్యవసాయ అధికా రులు సందర్శించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

అధికారులు సందర్శించాలి

నాకు అయినాపూర్ గ్రామ పెద్ద చెరువు ఆయ కట్టు కింద ఏడు ఎకరాల భూమి ఉంది. అందులో వరి పంటను సాగు చేశాను. సోమ వారం గాలి దుమారంలో కురిసిన వడగండ్ల వానతో చేతికొచ్చిన వరి పంట నేల పాలు అయింది.అకాల వర్షం కారణంగా గాలి దుమా రంతో పాటుగా వడగండ్ల వర్షం కురిసి నేల రాలిన పంట పొలాలను వ్యవసాయ అధికారులు ఇప్పటికీ సందర్శించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జరిగిన నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలి –నల్ల మైబయ్య, రైతు,అయినాపూర్

మామిడి రైతును ఆదుకోవాలి

నాకు ఎకరా ముప్పై ఆరు గుంటల మామిడి తోట ఉంది. సోమవారం కురిసిన అకాల వర్షం కార ణంగా కోత కొచ్చిన మామిడి కాయలు నేల రాలి నష్టం వాటిల్లింది దిర్సంపల్లితో పాటుగా పాలే పల్లి, దోమ,రాకొండ తదితర గ్రామాల్లో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిన కారణం గా ప్రభుత్వం మామిడి రైతులను ఆదుతకొని నష్ట పరిహారం అందించాలి –అఖిల్, మామిడి రైతు దిర్సంపల్లి గ్రామం

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాలాల్, ఏప్రిల్23: మండల పరిధిలోని కోకట్ రోడ్డులో గల ద మ్యాన్ టీ సెంటర్ దగ్గర రైల్వే ట్రాక్ సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు యాలాల ఎస్‌హెచ్ఓ గిరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోకట్ రోడ్డులో గల ద మ్యాన్ టీ సెంటర్ దగ్గర రైల్వే ట్రాక్ సమీపంలో బుధవారం వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మృతుడి వివరాలు ఆరాతీశారు. మృతుడి ఒంటిపై తెల్ల రంగు బనియన్, నీలపు రంగుగళ్ల లుంగీ, 50 నుంచి 55 ఏండ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికై తెలిసినా, ఎవరైనా గుర్తు పడితే యాలాల ఎస్‌హెచ్ఓ 871267 00 54, తాండూరు రూరల్ సీఐ 871267 0051, తాండూరు డీఎస్పీ 8712670 017 కు సమాచారం ఇవ్వాలన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి

కొడంగల్, ఏప్రిల్ 23: దీర్ఘ కాలిక భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఎంతగానో తోడ్పడుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం మండలం లోని పర్సాపూర్ గ్రామ రైతు వేదికలో భూభారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై అవగా హన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగ్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, నిషేధిత భూములు, ఆర్‌ఓఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామాలు వంటి సేవలు సులభతరం కాను న్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధి కారులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరిచేందుకు కృషి చేస్తారని తెలిపారు. రైతు సమస్యలను తెలుసుకునేందుకు గాను తహసీల్దార్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 2వ తేదీ నుంచి భూ భారతి పోర్టల్ అందు బాటులోకి రానున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న నూతన మున్సిపల్ కార్యాలయం, ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, మండల వ్యవసా యాధికారి తులసితో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పర్సాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

జవాబుదారీతనాన్ని పెంచేందుకే...

బొంరాస్‌పేట, ఏప్రిల్ 23: బొంరాస్‌పేట్ మండల కేంద్రం రైతువేదికలో నిర్వ హిం చిన భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జవాబుదారీతనాన్ని పెంచేందుకూ భూభారతి నూ తన చట్టం తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో జరుగుతున్న మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయాలని వైద్యాధికారి హేమంత్‌కుమార్‌కు సూచిం చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, వ్యవసాయ అధికారి తులసి, రైతులు పాల్గొన్నారు

క్రమ శిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు

ధారూరు, ఏప్రిల్ 23: విద్యార్థులు క్రమ శిక్షణతో బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.నర్సింహులు తెలిపారు. బుధవారం ధారూరు మండల పరిధిలోని గడ్డమీది గంగారం ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాలలకు అకడమిక్ ఇయర్ చివరి రోజు కావడంతో పాఠశాలలో చదివి 7వ తరగతి పూర్తి చేసుకోని ఉన్నత చదువుకోసం వేరే పాఠశాలకు వెళుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు మాట్లాడుతూ వేరే పాఠశాలలకు వెళ్లేటప్పుడు ఆందోళన చెందకుండా విషయ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానికోసం అహర్నిషలు కృషి చేసి తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు, పాఠశాలకు, పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఎంసీ చైర్మన్ మహే శ్వరి, నాయకులు అమర్‌నాథ్, చంద్రయ్య, రవీందర్, నర్సమ్మ, అంజయ్య, గోరెప్ప, ఉపాధ్యాయులు ఇందిరా, సుధాకర్, వెంకటయ్య, అంజిరెడ్డి, లక్ష్మి, జగదీశ్వరమ్మ, బి.వెంకటయ్య విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు..

కొడంగల్, ఏప్రిల్ 23: మండలంలోని చిట్లపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో బుధవారం పేరెంట్, టీచర్ సమావేశాన్ని నిర్వహించి వార్షిక పరీక్షలో ఉత్తీర్ణులైన మొదటి, రెండు, మూడు ర్యాంకులు పొందిన విద్యార్థులకు గ్రామానికి చెందిన అడ్వకేట్ మధుసూదన్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. 7వ తరగతి వార్షిక పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన కె. నరేశ్‌కు రూ. 3వేలు, ద్వితీయ ర్యాంక్ విద్యార్థిని నందినికి రూ. 2వేలు, తృతీయ ర్యాంక్ విద్యార్థి కె. వెంకటేశ్‌గౌడ్‌కు రూ.1000 ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.యాదగిరి, అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాల చైర్మన్ నాగమ్మ, ఉపాధ్యాయుల గోవర్ధన్, బనలక్ష్మి నాగప్ప, జ్యోతి అనితలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అడ్వకేట్ మధుసూదన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మండలంలోని హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వార్షిక పరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య పతకాలను అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

బొంరాస్‌పేట, ఏప్రిల్ 23 : వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మండల పరిధిలోని ఏర్పుమళ్ల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు పంపించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 128 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం గౌరారం గ్రామంలో శ్రీ సాయి రైస్ ఇండస్ట్రీస్‌నీ తనిఖీ చేసి రైస్‌మిల్ నుంచి సీఎంఆర్ ప్రభుత్వానికి చెల్లించాలని, బ్యాంకు గ్యారంటీ కూడా ఇవ్వాలని రైస్‌మిల్లుల యాజమానులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఓ మోహన్ బాబు, డీఎం మోహన్‌కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ గణపతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొడంగల్, ఏప్రిల్ 23: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పీఏసీఎస్ అధ్యక్షుడు కటకం శివకుమార్, కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ తెలిపారు. బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరిపతి సంఘం లి. హస్నాబాద్ ఆధ్వర్యంలో పర్సాపూర్, హస్నాబాద్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు అంజద్, పకీరప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై కేసు నమోదు

పెద్దేముల్, ఏప్రిల్ 23 : ఓ దినపత్రిక పెద్దేముల్ విలేకరి కృష్ణపై మండల పోలీసులు కేసు నమోదు చేశారు. పెద్దేముల్ మండలానికి చెందిన నాయకులు మహిపాల్ రెడ్డి విలేకరిపై ఫిర్యాదు చేశారు. మండల కేంద్రానికి చెందిన విలేకరి కృష్ణ మండలంలోని తింసాన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 14లో బిచ్చిరెడ్డి, లక్ష్మారెడ్డిలకు చెందిన భూమిలో అక్రమంగా సుద్ద తవ్వకాలు చేపట్టినట్లు మహిపాల్‌రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు మంగళవారం పెద్దేముల్ ఇన్‌చార్జి ఎస్ఐ గిరి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సమగ్ర పరిశీలన తర్వాత ఆ భూమిలో సుమారు 2వేల టన్నుల సుద్ద తవ్వకాలు జరిపినట్లు , వీటి విలువ రూ. 15లక్షలు ఉండొచ్చని తేలింది. ఈ మేరకు కృష్ణపై కేసునమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఉగ్రదాడులను వ్యతిరేకిస్తూ ర్యాలీలు

వికారాబాద్, న్యూస్‌నెట్‌వర్క్ ఏప్రిల్ 23: పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బుధవారం వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతృత్వంలో ర్యాలీలు నిర్వహించారు. పరిగి పట్టణంలోని కొడంగల్ క్రాస్‌రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాలతో ర్యాలీ జరిపారు. పరిగిలోని న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ముస్లిం మైనార్టీలు, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. కులకచర్లలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

వికారాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

పరిగిలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

పరిగిలో న్యాయవాదుల నిరసన

మనసు చలించిపోయింది..

వికారాబాద్, ఏప్రిల్ 23 : జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్, బైసరన్ వ్యాలీ ప్రాంతంలో జరిగిన ఉగ్ర దాడిని బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ బుధవారం ఒక ప్రకనటలో తీవ్రంగా ఖండించారు. దాడి గురించి తెలిసి మనసు చలించి పోయిందన్నారు. ఈ ఉగ్ర దాడిలో మరణించిన వారి కుటుంబాలకు భగవంతుడు అండగా ఉండాలని ప్రార్థిస్తున్నామన్నారు. బాధితుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకుని అండగా నిలవాలి, అలాగే ఇంతటి క్రూరమైన చర్యలకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు.

తీవ్రంగా కలిచి వేసింది..

పరిగి, ఏప్రిల్ 23: పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. పర్యాటకులపై ఉగ్రదాడి తనను తీవ్రంగా కలచివేస్తుందన్నారు. ఈ దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు ఆయన సానుభూతి ప్రకటించారు. ఈ క్లిష్ట సమయంలో ఐక్యంగా ఉందామని, భారతీయుల ఐక్యతను ఏ ఉగ్రవాదం విచ్చిన్నం చేయలేదన్నారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను అంతమొందించాలని కేంద్రాన్ని కోరారు.

అడవి పందులను వేటాడిన వారికి జరిమానా

ధారూరు, ఏప్రిల్ 23: అడవి పందులను వేటాడిన వ్యక్తులకు రూ. 55వేలు జరిమానా విధించినట్లు ధారూరు అటవీ శాఖ రేంజ్ అధికారి రాజేందర్ తెలిపారు. ఈ నెల 21 శనివారం మండల పరిధిలోని నాగసముందర్ గ్రామ సమీపంలో అటవీ పందులను వేటాడిన వ్యక్తులు ఎ.వెంకటేశం, టి.రాజు, జి. రమేశ్ , జి. ముత్యాలు, పి.ప్రశాంత్, పి.మానయ్య, పి.రాజేష్, జి. మారుతి పై కేసు నమోదు అయింది. వారికి రూ. 55వేలు జరిమానా విధించినట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి రాజేందర్ తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీ, శ్రీమతి మూల నాగరాణి భర్త శ్యామ్ రావు, గ్రా॥ ముజాహిద్‌పూర్, మం॥ కుల్కచర్ల వాస్తవ్యులు స్వార్జితం క్రింద సంపాధించిన ఆస్తిని తనఖా పెట్టుకొని శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ వారు లోను ఇవ్వడానికి నిశ్చయించినారు. కావున ఇట్టి యొక్క ఆస్థిపై ఎవరికైనా ఆరోపణలు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల 5 రోజులలోగా మా బ్రాంచి నందు సంప్రదించగలరు. లేనిచో ఈ యొక్క ఆస్థిపై ఎలాంటి వివాదాలు లేనివిగా పరిగణించి మా క్లయింట్ ముందుకు కొనసాగుతారు.

షెడ్యూల్ ప్రాపర్టీ : గ్రా॥ మల్కాపూర్, మం॥ పరిగి, జిల్లా వికారాబాద్‌లో సర్వే నం. 111/అ, 111/ఆ, 111/ఇ & 112ఆ ప్లాటు నం. 224, వైశాల్యము 200 చదరపు గజముల ఖాళీ ప్లాటు కలదు.

హద్దులు : ఉత్తరము: ప్లాటు నం.223, **దక్షిణము:** ప్లాటు నం.225, **తూర్పు:** 33 ఫీట్ల రోడ్డు **పడమర:** ప్లాటు నం.233.

బి.రాజశేఖర్ రాజు, అడ్వకేట్
ఇ.నెం. 12-24, నెహ్రూ కాలనీ, షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
సెల్: 9849415189

హెచ్చరిక ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, శ్రీమతి నేరట్ల సువర్ణ, భర్త: ఎన్.అంజయ్యగౌడ్, వయస్సు: సుమారు 51 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: 2, అంతిరెడ్డిగూడెం, రంగారెడ్డి జిల్లా వారు మాచన్‌పల్లె గ్రామం, షాబాద్ మండలం, చేవెళ్ల డివిజన్, రంగారెడ్డి జిల్లా వద్దగల సర్వే నెం. 159/1/1A/1/1/1/1/1/1/1లో ఎక. 1-15 గుంటల విస్తీర్ణపు భూమికి సంబంధించి నా క్లయింట్లు అనగా 1) శ్రీమతి కందికంటి విజయలక్ష్మి, భర్త: స్వర్గీయ కె.ఆనంద్‌గౌడ్, వయస్సు: సుమారు 63 సంవత్సరాలు, వృత్తి: గృహిణి మరియు 2) కందికంటి నందకిషోర్, తండ్రి: స్వర్గీయ కె.ఆనంద్‌గౌడ్, వయస్సు: సుమారు 39 సంవత్సరాలు, వృత్తి: అడ్వకేట్, ఇరువురి నివాసం: ఇం.నెం. 11-4-8/3, రోడ్ నెం. 6, శ్రీ వెంకటేశ్వర కాలనీ, సరూర్ నగర్ గ్రామం & మండలం, రంగారెడ్డి జిల్లా వారి పేరున 14-08-2024వ తేదీనాటి అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు నా క్లయింట్లు అమ్మకం ప్రతిఫలంలో భాగంగా బయానాగా పెద్దమొత్తాన్ని చెల్లించారు మరియు సదరు భూమి గుర్తింపు నిమిత్తం సర్వేయర్ సహాయంతో సదరు ఆస్తిని సర్వే చేసిన తరువాత నా క్లయింట్లు లేదా వారి నామినీ లేదా నామినీల పేరున రిజిస్టర్డ్ సేల్‌డీడ్ అమలు సమయంలో మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తారని ఒప్పందం కుదుర్చుకున్నారు.

నా క్లయింట్లు అనేకమార్లు అభ్యర్థన చేసినప్పటికీ శ్రీమతి నేరట్ల సువర్ణ, భర్త: ఎన్.అంజయ్యగౌడ్ వాయిదా వేశారు. నా క్లయింట్లు మిగిలిన మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. నా క్లయింట్లకు ఇటీవల తెలిసినది ఏమనగా, సదరు శ్రీమతి నేరట్ల సువర్ణ, భర్త: ఎన్.అంజయ్యగౌడ్ 14-08-2024 తేదీనాటి అమ్మకం ఒప్పందాన్ని కాదని సదరు ఆస్తిని మూడవ పార్టీలకు అన్యాక్రాంతం చేయాలని ప్రయత్నిస్తున్నారు. అందువల్ల, నా క్లయింట్లు 14-08-2024వ తేదీనాటి అమ్మకం ఒప్పందం క్లాజులను పాటించుట ద్వారా లీగల్ నోటీసు స్వీకరణ తేదీ నుండి ఏడు (7) రోజులలోగా సర్వేయర్ సహాయంతో సదరు భూమి సర్వే చేసి మిగిలిన మొత్తం రూ. 1,72,00,000/- (ఒక కోటి డెబ్బై రెండు లక్షల రూపాయలు మాత్రమే) స్వీకరించి సర్వే నెం. 159/1/1A/1/1/1/1/1/1 మాచన్‌పల్లె గ్రామం, షాబాద్ మండలం, చేవెళ్ల డివిజన్, రంగారెడ్డి జిల్లా వద్దగల ఎక. 1-15 గుంటల విస్తీర్ణంగల భూమికి సంబంధించి నా క్లయింట్ల పేరున రిజిస్టర్డ్ సేల్‌డీడ్ అమలు చేయుటకు 22-04-2025న లీగల్ నోటీస్ జారీ చేశారు.

అందువల్ల, శ్రీమతి నేరట్ల సువర్ణ, భర్త: ఎన్.అంజయ్యగౌడ్, వయస్సు: సుమారు 51 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: 2, అంతిరెడ్డిగూడెం, రంగారెడ్డి జిల్లా వారి నుండి సర్వే నెం. 159/1/1A/1/1/1/1/1/1 మాచన్‌పల్లె గ్రామం, షాబాద్ మండలం, చేవెళ్ల డివిజన్, రంగారెడ్డి జిల్లా వద్దగల ఎక. 1-15 గుంటల విస్తీర్ణంగల భూమిని కొనుగోలు చేయరాదని సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది. ఎవరేని ఈ హెచ్చరిక ప్రకటనను కాదని పైన తెలిపిన సదరు భూమిని కొనుగోలు చేసినచో అతను/ఆమె/వారు ఆ తరువాతి పరిణామాలకు మరియు ఖర్చులకు బాధ్యులవుతారు.

సం/- కె.జయభారత్ రెడ్డి, ఎన్.మాధురి, మారెడ్డి నిఖిత, అడ్వకేట్స్
ఫ్లాట్ నెం. 601, PRP రెసిడెన్సీ, ప్రగతి నగర్, SBI కాలనీ, L.B.నగర్, హైదరాబాద్-84, **ఫోన్ నెం. 9010044288.**